గాలికబురు

శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

ఊరి బయట శ్మశానంలో స్తబ్ధంగా, నిశ్శబ్దంగా నిదురించే ఆసమాధిలో ఉన్నట్టుండి ఏవో కలవరం బయలు దేరింది. అస్పష్టమైన ఏవో... అంతర్ధ్వనులు - ఒకప్పుడు కుక్కలు ఎముకలు నములుతున్నట్టు, మరొకప్పుడు పందులు 'గురగుర' మంటున్నట్టు, ఇంకొకప్పుడు నక్కలు మందలుగా పొదలమాటున పోట్లాడుకుంటున్నట్టు-ఆగి ఆగి అలజడులు పుట్టిస్తున్నయ్.

మసగచీకటి. మన్నూ, మిన్నూ ఏకంచేసే వొడుపుతో అంతరాళంగుండా అలుముకు పోతోంది.

ప్రక్కనున్న ఈతపొదలు సూదిమొనల చూపులతో చీకట్లు చీల్చుకుంటూ ఉన్నవ్వత్తుగా, పంతం వేసుకుని పైకి లేచినట్టున్నయ్; తమస్సుకు తడఖాటు పుట్టిస్తున్నయ్-

గాలిగాడు (గాలి) గుట్టలూ, మిట్టలూ, గడుచుకుంటూ పడుతూ, లేస్తూ, తూలుతూ తొట్రుపడుతూ సాగలేక ముందుకు సాగి పోతున్నాడు.

ఉండి, ఉండి సమాధిలో చప్పుళ్లు బయలు దేరినై.

అదాటున విని ఉలికిపడ్డాడు గాలిగాడు.

వెనకడుగు వేసి వత్తివాడిలా దిక్కులు పరికించాడు.

సవ్వడులు పెద్దవయినయ్; గాలిగాడికి మరింత భయం వేసింది. మాట పెగల్లేదు-ఓ క్రమాలకి ఆ ధ్వనులలోనించి మానవుని గొంతు వినవచ్చింది. స్పష్టంగా, అర్థమయ్యేలా: - ధైర్యం తెచ్చుకుని అడుక్కూ చూసి తీక్షణంగా పరికించాడు గాలి.

"మాస్తావేం నేనే-" ఆ గొంతు గద్దించింది.

"ఎక్కడ నువ్వు?" గాలిగాడి ప్రశ్న.

"ఇక్కడే ఈ సమాధిలో-" మాటకు మాట సమాధానం వచ్చింది. గాలిగాడికి ఒళ్లంతా ధైర్యంతో ఉబ్బిపోయింది.

"ఎవరు నువ్వు?" అడిగాడు గాలి.

"నేనే-" 'నన్ను ఎరగవా?' అన్నట్టు సమాధానం.

"నువ్వంటే?" గాలిగాడు గద్దించి అడిగాడు ఈమారు. "నేనంటే నేనే-నన్నెరగవూ? పోలిసెట్టి వెంకణ్ణిరా" సమాధానం చెవులో కొట్టినట్టున్నది.

క్షణం ఆలోచించాడు గాలి. అంతా ఆకళింపుకు వచ్చింది అన్నాడు. "ఆరి నీ తస్సాదియ్యా! వెంకడివట్రా నువ్వా? నా అంతవాణ్ణి ఘడియలో గజిబిజి చేశేశావ్."

"గొంతయినా గుర్తించలేదురా గాలీ?" వెంకడు అడిగాడు.

"ఊహు-నీ గొంతు...అదోలావుందిరా! మనిషి మాటాడినట్టే లేదు. చప్పగా మారి పోయిందీ! ఆడ, మగ భేదంకూడా తెలీటం లేదురా!" స్తిమితంగా కూర్చుని ఆశ్చర్యంగా అన్నాడు గాలి.

"అవున్లే-అదీ నిజమే. నేను బతికున్నప్పుడు ఎట్టా మాటాడినా ఇప్పుడు పూర్తిగా మారిపోయిఉంటాను-నువ్వా... పంచభూతాల్లో ఒకడవు! నేను పాంచభౌతికమైన శరీరం వదిలేస్తున్నాను. అందుకని నీకు కొత్తగా వినబడినా వినబడవచ్చులే!" అన్నాడు వెంకడు.

"అప్పటికీ, ఇప్పటికీ పోలికే లేదూ!" పూర్వపు సంగతులు జ్ఞాపకం చేసుకుంటూ అన్నాడు గాలి.

"అవును. ఇప్పుడు మేం మాటాడే తీరే వేరు. అందుకే మేం అంటే మనుషులు గుండెలు గుప్పిట పెట్టుకుని ఉంటారు. మా చాయలకి రావడానికే బెదిరి బేజారై పోతారు." తన బలాన్నంతా కూడ తీసుకుంటూ సమాధిలోనుంచి వెంకడి సమాధానం.

"సరేగానీ, ఏవిటే అంత గందరగోళం చేశేశావ్?" అడిగాడు గాలి.

"గందగోళం లేదు గోడగెడ్డలూ లేదురా! ఓ చెంప నేనేదో దిగులుగా ఆలోచించుకుంటూంటే నన్ను పీక్కు తినాలని కుక్కలు, నక్కలు, పందులు-వచ్చి మేము ముందు తినాలంటే మేము ముందని వాటిలో అవే పోట్లాడుకు చస్తున్నయ్. కూర్చున్న చోటునించి కదలనివ్వవు. నువ్వు ఎక్కడ దాటిపోతావో అని అదుర్దా. చూసిచూసి నాకు చిరాకెత్తు

కొచ్చింది. పక్కనున్న ఈతమోడు వేళ్ల గించి లుంగలు లుంగలుగా బాది వదిలి పెట్టా...అదీ...ఆ మోత అంతాను" 'అమ్మయ్యా' అన్నట్టు ఒక నిట్టూర్పు విడిచాడు వెంకడు.

"నీకు దిగులేవిట్రా? అయినా దేవలోకంలోకి ఎగిరిపొయ్యేవాడవు ఇంకా ఇక్కడేపడి ఏడుస్తున్నా వెందుకు?" గాలిగాడు గొంతు తగ్గించి నిదానంగా అడిగాడు. "మరేరా. నాతో పాటు వచ్చినవార్లందరూ కనుచూపుకందని మేరకు ఎగిరిపోయారు. నేనే ఇక్కడ పడిఏడుస్తున్నా, స్వర్గమూ చట్టుబండలూను. చూడు! ఇక్కడకంటే అక్కడ ఏమంత ఒరిగిందంటావ్? అదంతా వట్టిచవిటిపఱ్ఱ. పోయేవాళ్లందరూ మొత్తుకోవడమేకదా!"

"అలా అనకు వెళ్లినవాళ్లు అక్కడ సుఖపడతారులే!"

"ఏమో నాకు నమ్మకం లేదురా, ఏమైనాగానీ వెళ్లి ఏడవకతప్పదుగా! నువు ఎప్పుడు వస్తావా, ఆ కాస్త కబురూ చెప్పి వెళిపోదామా అని కనిపెట్టుకు కూర్చున్నా. కడుపురా నాయనా కడుపు-కన్న కడుపు అట్టా ఏడిపిస్తుందిరామరీ!" వెంకడు వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు విన్నాడు గాలి.

"ఏడుస్తావెందుకురా పిచ్చివాడా? నేను ఉన్నాగా నీకు కావలసిన సాయం చెయ్యడానికి? చెప్పరాచెప్పు. నువ్వు చెప్పేదేవిటో చెప్పు!" అన్నాడు ఓదార్పుగా.

"నేను అంతా చెప్పేవరకూ ఉంటావురా గాలీ? మధ్యలో ఊడాయించవుగదా! సంశయంగా అడిగాడు వెంకడు.

"నే నెక్కడికీ పోనురా, చెప్పు! చూస్తున్నావుగా వెళ్లలేక వెడుతూన్నా."

"తొందరపనులేవీ లేవుకదా అని:"

"ఇప్పుడేం తొందర ఏడుస్తుంది. చీకటి ఘడియల్లో నెలపొడిస్తే అప్పుడు-అందుకేగా నడిచిపోతున్నానూ!" "అన్నట్టు నీ వాహనం ఏమయిందిరా?"

"దాని దుంపతెగిరి. ఆ లేడిముండ వెన్నెల్లో తప్పితే ఉత్తప్పుడు నా జాయికే రాదు. వచ్చినా ఇప్పుడో కాసేపో అన్నట్టు ఉసూరుమని నడిచి ఏడుస్తుంది. అందుకని ఇండిదగ్గిరే కట్టేశాను. వెన్నెల్లో దానిపరుగే పరుగనుకో! ఆడుమగ-అందరూ మేడలపై అంతస్తులమీద ఎక్కి నాకూ దానికీ కూడా ఊపిరిసలపనిస్తారా? కన్ను మూసి తెరిచేలోపల ఒకసారి భూవలయం పర్యటిస్తూ ఉండాలి! దానికి తోడు ఎక్కడెక్కడ మంచి వాసనలున్నా పీపున గట్టుకు మోసుకుపోవాలి. సముద్రం ఒడ్డున బంగలాల్లో నివసించే పెట్టిపుట్టిన దొరలకి కిటికీల దాకా కెరటాలు జిమ్మాలీ-సరే నా సోది ఎంతచెప్పినా తరగదు. ఇప్పుడయినా...అసలువెల్లక తప్పదు. నీమాటలు తొందరగా చెప్పెయ్యి!" వెంకడి యెడ సానుభూతితో అన్నాడు గాలిగాడు.

"నా బతుకంతా నీకు తెలిసిందేకదరా!" చెప్పటం మొదలు పెట్టాడు వెంకడు.

"నాకు తెలియకపోవడమేవిటి? చిన్నప్పట్నుంచీ నా ఒళ్ళో పెరిగిన వాడివికదట్రా నువ్వు?-మండు వేసంగిలో మళ్లుపోస్తే ఎండి ఏరింపులయ్యే నారుకి ఏతాం తోడుతున్నప్పుడు ఎంత కమ్మని పాటలు పాడేవాళ్లురా మంగీ నువ్వూను. కదల్లేక ఓక్షణం మీ ముందు ఆగినట్టు ఆగి ఇట్టే దూసుకుపోతుంటే వాడిని, జ్ఞాపకం లేదూ?"

"ఉండకేం-ఇప్పుడు ఆ రోజులు తల్చుకుంటే..."

"నాకూ విచారం వేస్తుందిరా-ఎండనక, వాననక-కఱ్ఱ బుజాన పెట్టుకుని, కాడిగట్లంట తిరుగుతూ, పచ్చనిపైరు చూసుకుంటూ ఒక్కనాడు అన్నానికే వెళ్లేవాడివి కాదుగా!"

"ఆ రోజుల్లో అన్నం తినాలనే అనిపించేది కాదురా! పచ్చనిపైరులు పరవళ్లు తొక్కుతుంటే కడుపు నిండిపోయినట్టే ఉండేది!"

"అవును-అప్పుడప్పుడూ అన్నంమూట నెత్తినపెట్టుకుని పొలంవచ్చి నిన్నూ నీ ఆనందాన్నీ చూస్తే మంగికళ్లు మిలమిలా మెరిసిపోయేవి; మీ యిద్దర్నీ చూస్తే నాకు ఒళ్లు పొంగిపొయ్యేదిరా! తరంగాలు తరంగాలుగా పైరుమీద పొర్లాడుతూ, వెళ్లలేక వెళ్లలేక మిమ్మల్ని వదిలి వెళ్లేవాడిని."

"మంగి!-అదీ చచ్చిపోయిందిరా!"

"ఆ. హా...హా...మహాదొడ్డ ఇల్లాలురా అది."

"చివరికి ఎంత నికృష్టంచావు చచ్చిందిరా! చలిజరంవచ్చి సుక్కి శల్యమైపోతే చూసేదిక్కు లేక, గుక్కెడునీళ్లుపోసి గొంతు తడిపే హంగులేక అలమటించిపోయిందిరా."

"అవునురా పాపం! ఆ నాడు అరుబయట పెట్టుకుని పేగులు కోసుకుపోయేలా కళవళంగా నువు ఏడవటం, నా జన్మలో మర్చిపోగలన్రా? తల్చుకుంటే ఇప్పుడు తరుక్కుపోతై నా గుండెలు."

"ఆ నాటితోనే నా దీపం ఆరిపోయిందనుకో!"

"పోక ఏముందిరా మరీ!"

"సొంతం చేసుకునేవాడయినా అట్టా చేస్తాడూ? నువ్వేరగవ్ వాడి పనులన్నీ ఎట్టా చేసిపెట్టేవాడినో."

"ఎరుగున్నా వాడి పనులు నేనుమటుకు చెయ్యలేదూ? కుప్పలు నూర్చినప్పుడు పొల్లంతా ఎగరగొట్టి కళ్లంలో కణికల్లాంటి ధాన్యం రాసులుపోయించింది నేను కాదూ?"

"బంగారం రాగాలీ!-బంగారం రాసులు పోసి గాదెలు నింపాను. అయితేయేం నా పబ్బంగడుపుకోడానికి జొక్కెడు మెతుకు లక్కే మొహం వాచిపోయాను చివరి రోజుల్లో."

"అవును పాపం! చివరికి ఏం జరిగిందేవిటి? నే నంత శ్రద్ధగా వింటంలేదు ఈ మధ్య."

"జరిగేదేముంది? అంతా చెబుతా విను-నా కొడుకు రంగమెళ్లడం తెలుసుగా!"

"వాడు-పెద్దవాడు?-"

"పెద్దా, చిన్నా-అన్నిటికీ వాడు ఒక్కడే కదురా నాకు?"

"అవునవును. అప్పుడు పెద్దపడవలో యెక్కి వెడుతూంటే నేనే తోసుకు వెళ్లినట్టు జ్ఞాపకం."

"వాడు వెళ్లి ఇన్నేళ్లయినా నాకేవీ కష్టం అనిపించలేదు. నాది అంటూ చేరెడు నేలలేకపోయినా ఆ పంచనీ, ఆ పంచనీ పడిఉంటున్నా. ఆయన దగ్గిరే కవతంలో జేరాను. నాదే అనుకున్నాను. ఇంత పండించి పోశాను, పెట్టింది తిన్నాను."

"ఏదో అంటావేవిటి? నువు కవతంలో కాలుపెట్టిన ఏడే కోటిలింగం 'కోటలో పాగా' వేశాడనుకున్నా. లేకపోతే పదగూడు బస్తాలు పండించేసరికి ముక్కంబడి నెత్తురుపడేది, ఆ యేడు ముప్పై బస్తాలు మొక్కజొన్నలు పండినయ్యంటే అదంతా నువు కాలుపెట్టిన వేళావిశేషంకాకపోతే మరేవిటంటావ్?"

"వేళా, పాలాను-నిజానికి గాలీ! అట్టాగే ఒళ్లెరక్కుండా పాటుబడ్డాం, పండించాం, తిన్నాం."

గ్యారంటీ చికిత్స

వీర్యవృద్ధి బలం కల్గించి, నపుంసకత్వం పోగొట్టుటకు 45 సం॥ల జగత్ప్రఖ్యాతి చెందిన సంస్థ.

డాక్టర్ రత్నం సన్స్

మలకపేటబిల్డింగ్స్, హైద్రాబాదు.

"ఆనాడే మొదలు-వచ్చి, వచ్చి పాపం పెరిగినట్టు పెరిగివచ్చింది అప్పంతాను. ఇదంతా నిజానికి నీది కాకపోతే మరెవరిదిరా?"

"ఆ మాట అనకు! పీక పిసుకుతాడు కోటిలింగం.

"నాకేం భయంరా, ఇక్కడే కాదు, ఈ ప్రపంచంలో ఏమూలనైనా బాకా వూది మరీ చెబుతాను."

"ఇట్లాగే గడిచిపోతోంది. పనో, పాటో చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాం. నెలకి నాలుగో అయిదో రంగంనించి వాడూ పంపుతున్నాడు. కొంత కుదుటబడ్డదికదా-అనుకున్నానురా, సంసారం."

"అవును-నువు ఆనాటిరాత్రి వెన్నెల్లో, పంటకళ్ళంలో ధాన్యంరాసిమీద వెల్లకిలా పడుకుని ఈ ప్రపంచాన్నే మరిపిస్తున్నట్టు ఏవో పాటలు పాడావురా! నేను వేగంగా ఎగిరిపోతూ విన్నాను, విని అప్పుడే అనుకున్నా, వీడికి జీవితంలో [illegible] పెద్దఆనందం కలిగిందని."

"ఆనాడురా గాలీ! నేను గుండెలమీద చెయివేసుకుని నిశ్చింతగా ఒక్క ఘడియసేపు ఆదమరిచి పడుకున్నాను. అయితే ఏం? నాబోటి 'చవుకరుగాళ్ల మొహానికి' ఎంతసేపు నిలుస్తుందని ఆ ఆనందం? - పొలానికి అప్పుడే కబురొచ్చింది. 'మంగి కష్టపడుతోంది, తొందరగా ఇంటికి రమ్మ'ని. కళ్ళంలో మేలురాసి వదిలి యెట్లావెళ్లను. కబురుచెప్పొచ్చిన మా బావమరిదిని అక్కడుంచి ఇంటికి పరుగెత్తాను, అప్పటికే అంతా అయిపోయింది - మంగి కనరాకన్నది, ఇద్దరు కవలపిల్లలు పుట్టారు. ఒకత్తె చచ్చిపోయింది. ఇంకొకత్తె ఇప్పుడో కాసేపటికో అన్నట్టు గుటకలు మింగుతోంది. మంగి మనలోకం తెలియకుండా పడివుంది.

"ఇదంతా నాకు తెలీదు కాని, తరవాత కొన్నాళ్లకి అనుకున్నాను, నువు పాలు తీసుకువెళ్లి శ్మశానంలో ఓగోతిలో పోసి వస్తుంటే - ఎవరో పాలుకుడిచేపిల్ల చచ్చిపోయివుండాలి' అని."

"అప్పుడు అడిగావ్ నా పాట్లు! కుప్పలు సొంతంనూర్పలేదు, కవతంగింజలు ఇంటికిరాలేదు. నావుకితెచ్చినబస్తా వొడ్లు అయిపోయినై - అక్కడాఅక్కడా అడిగి తీసుకువచ్చే మంగి మూలపడింది. పాతం దొమ్మ, తిప్పుకోవాలి, అంగుడు మందిప్పించాలి, చావగా బతికిన ఆ పిల్లని బతికించాలి - నాకు ఎవరు పలుకుతారు? పిల్లని ఎవరు బతికిస్తారు? దెబ్బమీదదెబ్బ తగిలిందనుకో! తలదిమ్మెక్కిపోయింది."

"ఆపదలు ఒక్కసారే ముంచుకువస్తయ్‌రా!"

"డబ్బుకావాలి, చేతులో ఎన్నియో గానీ లేనిది ఎవరు పలుకుతారు? కోటిలింగంకొట్టాంలో యెంతఉంటేనేం?"

"ఏమైనా అన్నీ దిగమింగుకుని ఆయన కాళ్లమీదనే పడదామని వెళ్లాను. సంగతి చెప్పాను. శాంతికరూపాయిలు ఓబస్తాగింజలు ఇప్పించమన్నాను. 'మాసూలంతా కావాలన్నాడు!' ఇంట్లో పెళ్లాం పిల్ల, మందులేక మురిగిచస్తున్నా, రన్నాను. "కావాలంటే కాయితంరాసి తీసుకెళ్ళమన్నాడు -" వెంకడిగొంతు ఓ క్షణంపాటు బొంగురుపోయినట్టుంది.

"వాడిగుండె నల్లరాయికొలిచిచేసినట్టున్నాది."

కోపంతో పళ్లుబిగించి అన్నాడు గాలి.

వెంకడు గొంతుసవరించుకుని తిరిగి చెప్పబోతున్నాడు.

"ఆ కాగితం కరామత్తులు నేనింతవరకు ఎరగను, అదేదో నీరాకే తగలెయ్యండన్నాను. తల ఊగించి 'ఊ' కొట్టి ఊరుకున్నాడు. నాకుగుండెల్లో దడప్రారంభమయింది. నోరు తడిఆరిపోతోంది. నాలుక పిడచకట్టుకుపోతోంది. 'లేవరేం, అని ఒక్క అరుపు అరిచాడు ఒళ్ళుతెలియకుండా. ఏం రాశాడో, ఏంచేశాడో... ముప్ఫై రూపాయిలు తెచ్చి నాచేతిలో పెట్టి, 'తీసుకువెళ్లరా' అన్నాడు. ఒక్క అంగలో ఇంటికొచ్చివాలాను తరవాత ఆ తల్లీ, పిల్లలో నేను పడ్డఅగచాట్లు దేవుడికెరుక. కూటికి గుడ్డకి మొహంవాచి వేళకీ పాళకీ తిండిలేక 'నావుతప్పినకన్ను లొట్టపోయి' నేనువుంటే పనిలోనికివెళ్ళని రోజులు నాగాలుకట్టినాడు. ఏలాగైనా కానీ ఇచ్చే కవతంలో ముప్ఫైగింజలు తరగొట్టాడు. ఈ వజాన నన్ను మహావిడిపించుకుతిన్నాడు. ఎంతఉసురుపడ్డానో... అయినా మళ్లీఅయ్యగ దగ్గరకివెళ్ళకుండా అక్కడే కనిపెట్టుకుని ఉన్నాను.

"పదిహేనేళ్లయింది. తరవాత ముగ్గురు పుట్టిపోయారు. కడుపూ కాయాకట్టుకుని ఆ పిల్లని ఎలాగో బతికించుకున్నాం."

"అవును. నీ కూతురు నీరమ్మవుండే అది నిప్పంటి పిల్లరా!" గాలిగాడి గొంతులో వాత్సల్యం పొంగి పొరలింది.

"షావుకారు కోటిలింగం నన్ను ఒక అందాన బాగుచేశాడూ? ఇచ్చినడబ్బు తీసుకోడానికి ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువులు నీళ్ళుతాగించాడు."

"ఎప్పుడో నా చేతులో ఆడినప్పుడు నాలుగో, అయిదో వసూలేసుకోండని తీసుకెళ్లి ఇవ్వబోతే ఇప్పుడు తొందరేంరా తరవాత లెక్కజూసి చెవుతాలే!" అని చక్కా పోయేవాడు.

"ఏడాదో ఆగస్తెల్లో గడిచిం తరువాత వడ్డీ పెరిగిపోతోంది ఏమంటావ్? అని కేకపెట్టేవాడు. అప్పుడు నా దగ్గిర డబ్బు నిలవఉంటుందా? మా వాడు పంపిన నాలుగో, అయిదో ఉంటే దేనికో ఒక దానికి ఖర్చయిపోయేది.

"డబ్బుకీగింజకీ కూడా ఎద్దడొచ్చి గిజగిజలాడి పోతున్నప్పుడు ఇస్తావా? చస్తావా? అని కూచుంటే నేను ఏంజెయ్యగలను? ఎక్కడ తెచ్చి ఇవ్వను?

"అక్కడికీ ఒకసారి ప్రాణంమీదకు తెచ్చి పదిరూపాయలు కట్టుకుని పొల్లగానైన పెయ్యను తోలిచ్చా. ఒకసారి ఈన మోపులైన తొలుమారి గేదె పడ్డను టికమీద కత్తిపెట్టి తోలించుకువెళ్లి గడిలో కట్టేసుకున్నాడు.

"ఈ పదిహేనేళ్లలోపల ఇట్లాటివి ఎన్ని వరుమానాలు కట్టబెట్టానో... ఊహు-బాకీ చీరా అయిందనేదే. ఏడాదో, రెండేళ్లో ఆగి వడ్డీ పెరిగిందని ఓ పాలికేక పెట్టడం, నేను పిసుక్కుచావడం.... అబ్బబ్బబ్బ... ఈయన బాకీతో నాకు తలప్రాణం తోక్కొచ్చిందంటే నమ్మరా."

"అంతేగామరీ చెడిబతికిన ముండాకొడుకు 'ఛీ' అన్నా 'థూ' అన్నా చేతో తుడుచుకుని చాకొట్టో రాచేసుకుంటాడు"

"ఆ సమయాని ఏ మారాజునో బతిమాలాడితే తరం ముక్క రాయించడమే గాని మావాడికికూడా రాయించలే, వాడు అక్కడ దిగులుపడి పోతాడని.

"ఈ పదిహేనేళ్ళనుంచీ ఈ తీరున గడిచిపోయింది నాబతుకు. పిల్లపెళ్లీడుకొచ్చింది. ఎక్కడో అక్కడముడిపెట్టాలి. తప్పదు-చేతిలో కాని డబ్బైసా మెసలటం లేదు. ఏంజెయ్యాలి ఇప్పుడు? అని ఆలోచించాను.

"ఏకాడికో ఓకాడికి ఆమేనమామకు ఇచ్చి ముడెడదామనుకున్నా, తల్లీఅందుకు

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి-నెల్లూరు జిల్లా.

ఒప్పుకుంది. కవ్వింతంగింజలు కోసం ఎదురు చూస్తున్నాను. రోజులు గడిచిపోతున్నై.

"ఏం చెప్పనురా గాలీ. ఇప్పటికి ఇంత వరకు గడిచి గట్టెక్కాంకదా బయటపడి పోదామనుకుంటే ఎప్పటికప్పుడే ఏదో కొత్తిన వచ్చిపడుతుంది కదా!"

"అదీ నిజమే మరి! ఎవరోతప్ప అందరి బతుకూ ఒకలా తుద నెగ్గడం ఎంతకష్టం?"

"నీకు ఒక్కనికి జాలికలుగుతోంది నా బతుకు వింటూంటే. సరే - మిగతా సంగతులుకూడా చెబుతా విను-!"

"కోటిలింగానికి - ఒక్కడే కొడుకని తెలుసుగా?"

"నాకు తెలియదూ? వెధవ. మొన్న ఉప్పెనగాలికి గండం గడిచి బైట పడ్డాడూ?"

"వాడే - వాళ్లకు ఏం కావాలి? కావలసినంత ఉన్నది. ఎలా ఖర్చుచెయ్యాలో తోచక తెలివితేటలు ఒకొక్కప్పుడు వెర్రితలలు వేస్తావుంటాయిలే! కళ్లకు పొరలు కప్పుకుపోయి మన్నూ మిన్నూ కానకండా ప్రవర్తిస్తారు."

"తెలుసురా. నాకు తెలుసు వాడి చేష్టలన్నీ."

"తెలుసుకదా! ఇంక నేను చెప్పేది ఏముంది? అయినా నా సంగతి చెవుతా విను!

"ఓనాడు సాయంత్రం మా వీరమ్మ పొలంనించి ఇంటికొస్తుంటే ఆ తాటితోపు మొగిలో కాచుకుని చేయిపట్టుకు లాగాడు, అనేకవిధాల బలాత్కరించటానికి ప్రయత్నంకూడా చేశాడు."

నాకు తెలీనట్టు చెవుతావేరా, ఆనాడు ఆ చిన్నది ఎన్ని విధాల ఎదిరించిందనీ, అసహాయస్థితిలో ఉండికూడా? గిల్లి, కరిచి, రక్కి-వాణ్ణి ముప్పతిప్పలూ పెట్టింది. కాని, మొగవెధవకాదూ అదొక్కత్తే ఏం చెయ్యగలదు? పెద్దగా అరిచింది. ఆ తాటితోపులో 'వో' అని ప్రతిధ్వనించింది. నేను తొందరగా పడిపోతున్నాను. ఏంజెయ్యాలో తోచక పోతూపోతూ ఒక ఎండుకమ్మ విసిరికొట్టాను. దానితో వాడి చెయి అంగుళంలోతు తెగిపోయి నెత్తురు వరదలైంది. వీరమ్మ పారిపోయి వచ్చింది."

"ఆనాడు నువ్వేకనుక ఆపాటిసాయం చేయకపోతే ఏమిజేసేవాడో కదా దుర్మార్గుడు! ఇంటికివచ్చి నాతోనూ తల్లితోనూ చెప్పి వలవలా యేడ్చింది. ఏంచెయ్యగలం?

"అన్నిహంగులూ వాళ్ల అధీనంలో వునయ్, ఎదిరించి ఏంచెయ్యగలం? మింగి ఊరుకుందామంటే కడులో రగిలిపోతోంది మంట 'ఏమిటిగతా?' అని ఆలోచించుకుంటున్నాను.

"మా వాళ్ల అందరిలోనూ ఈ మాట పాక్కిపోయింది. నేను ఊరుకుంటే వాళ్లు ఊరుకుంటారా? నాబావమరిదికి తెలిసింది. అందరినీ కూడగట్టుకువెళ్లి 'ఇదిఅక్రమం. అని కేకలువేశారు. దౌర్జన్యానికి దిగారు. ఏం కొనసాగుతుంది? మరో క్షణంలో పోలీసుల తుపాకిదెబ్బలకి ఇద్దరిప్రాణాలు బలి అయినయ్. మిగతావాళ్లు ఈ నాటికీ ఖైదులో మగ్గుతూనే వున్నారు.

"ఆ నాటితో నాకవ్వింతం ఊడిపోయింది. తల్లీ, పిల్లనూ ఎలాబతికించాలి-మాకడుపులో కూడుపెట్టి పెంచుకున్నామే! ఒక్కగానొక్క ఆడపిల్లగదా అది! మతోపాటు తినీ, తినికా మాడిచస్తుంటే చూసిఎలా వూరుకోగలం?"

"నాకు కడుపు తరుక్కుపోయింది, కొడుకు పంపించే అయిదారు రూపాయలు బాకీ తీర్చటానికి చాలటంలేదు. వడ్డీ పెరుగుతోంది పాపంపెరిగినట్టు. ఏపనో పాడో చేసుకుని కలో, గంజోతాగి చావకుండా బతికివున్నాం ముగ్గురమూ."

"నాలుగు నెలలు గడిచినై. మన్యజ్వరాలు మావూరంతా వ్యాపించినయ్. ఇంటింటికీ, మనిషి మనిషినీ- పట్టి, పీల్చి, పిప్పిచేస్తున్నయ్. మందా?, మాకా?- ఆయువుగట్టిగా ఉండి బతికినవాళ్లు బతుకుతున్నారు, పోయినవాళ్లు తుడిచిపెట్టుకుపోతున్నారు. మా మంగి ఆజ్వరంతోనే తీసుకుని చిక్కిశల్యమై ఆ బిడ్డను నాకు వదిలిపెట్టి వెళ్లిపోయింది. అది పోయినాలుగు నెల్లు గడిచాయో లేదో, నేనూ మంచాన బడ్డాను. వారంరోజులకే కలరా తగిలి చచ్చిపోయాను. ఇదుగో! ఇక్కడ పూడ్చిపెట్టారు నన్ను-"

"నా బిడ్డ వీరమ్మ బతికిఉంది. దిక్కులేనిదానిని ఎవరుచూస్తారు? ఎలా బతుకుతుంది? నా కొడుకు దూరానవున్నాడు. వీరమ్మ పుట్టింతరవాత వాడు ఎరగనే ఎరగడు. ఈసంవత్సరమే వేసవికాలం నాటికి డబ్బుతీసుకు వస్తాను అమ్మాయి పెళ్లిచేదాం. నా పెళ్లిచేసుకుంటాను. అని ఏనాడో రాశాడు. అమ్మా, నాన్నా - చచ్చిపోయారని వాడికి తెలీయదు. ఉత్తరంముక్కైనా రాయించే వెసులుబాటు దొరక్కుండానే, నేను చచ్చిపోయాను. ఇదంతా వినివాడు ఎంత ఏడుస్తాడో..."

"ముందు నా బిడ్డగతి చూడాలి. ఈ ప్రపంచంలో వాడుతప్పదానిని మాసే దిక్కు ఎవరూలేరు. ఇట్లాగే కొంతకాలం ఉంటే అదీ ఏన్యమో, గొయ్యో చూసుకుంటుంది. మావాడు ఖైదునించివస్తాడని ఎదురుచూస్తుంది. ఈలోగా ఈదుర్మార్గుడు ఇంకా యేం అఘాయిత్యం చేస్తాడో...."

"నాది కన్నపడుపు కనక దాని పాట్లు తలుచుకుంటే కుమిలిపోతున్నాను. కాని ఏంచెయ్యగలను? నెనూ ఇక్కణ్ణించి వెళ్లిపోవాలి. నాకు సమయందాపురించింది. మాట తబ్బిబ్బౌతోంది. ఇంతకాలం నీకోసమే బిగించుకు కూచున్నాను. నేనువెళ్లిపోవాలి గాలీ! నాబతుకులో జరిగిందంతా నా కొడుక్కు వినిపించు! నిన్నేనమ్ముకున్నాను గాలీ."

"నువ్వే వెతికి పట్టుకోవాలి రంగంలో, నాకు తెలీదుకదా! దిక్కులేని నాబిడ్డని కాపాడమని కబురుచేశానని చెప్పు! దిక్కులేక అలోలక్ష్మణా అని అమటించి చచ్చిపోతోందని చెప్పు! వెళ్లు గాలీ! తొందరగా బయల్దేరి వెళ్లు! నాబిడ్డ చచ్చిపోకుండా చూడు. నీకువప్పగించి పోతున్నా. నా బిడ్డకనబడని ఏదోపాడు లోకంలోకి పోయిపడుతున్నా. అదుగో దుర్మార్గులు నన్ను పిలుస్తున్నారు. నేను వెళ్లిపోవాలి. నా బిడ్డనిచూడు గాలీ!"

"నేను ఇప్పుడే వెడుతున్నాను. అడుగో నీకొడుకు రంగంలో ఒక దొరబంగళామీద కూర్చుని ఎవరితోనో కబుర్లాడుతున్నాడు. నాకు కనబడుతున్నాడు - ఈ క్షణంలోనే నేను నీకబురుచెవుతాను. నాలోమమకారం నశించిపోయింది. నెలపొడిచింది. సహానాన్ని పిలిచాను. ఇదిగో వచ్చిందికూడా, రెప్పపాటుకాలంలో. నీ కొడుకు దగ్గర వాలుతాను. దిగులు పెట్టుకోకు..."

"నిన్నే నమ్ముకున్నాను గాలీ!" ఇక వినబడలేదు వెంకడిగొంతు. సమాధిలో అట్టడుక్కు వెళ్లిపోయింది, ఏదో సన్నని నాదం.

లేడి వాహనంఎక్కి గాలిగాడు రివ్వున ఎగిరి పోయాడు.

అంతవరకూ నిక్కపొడుచుకు వింటున్న ఈతచెట్లు ఒకసారి తలలు ఆడించి 'సుయ్' మని-చిన్న సవ్వడి చేసినయ్.

సమాధులన్నీ చల్లని వెన్నెల్లోస్నానం చేసి సుఖంగా నిదురోతున్నయ్.—

★